
# కోడి-గుడ్డు



“పోయినసారి ఇండియా వెళ్ళినప్పుడు గవర్నమెంటాలిటీ కథలు - గవర్నమెంటులోని లంచాల కథలూ, అవినీతి కథలూ, బంధుప్రీతి కథలూ రాశావు. ఈసారి ఏం రాద్దామనుకుంటున్నావ్”? అని అడిగాడు పురుషోత్తం నవ్వుతూ.

“ఈసారి కథల ప్లాట్ల కోసం వెళ్ళటం లేదు. మా అమ్మగారిని చూడటానికి వెడుతున్నాను” అన్నాను.

“పోయినసారి కూడా అంతేగా. మంచి కథలకి ప్లాట్లు దొరుకుతాయేమో చూడు” అన్నాడు ప్రోత్సాహమిస్తూ.

నవ్వుతూ అన్నాను - “కథల ప్లాటు సంగతేమో కానీ, హైదరాబాదులో నా ప్లాటు అమ్మేద్దామనుకుంటున్నాను”

అలా అన్నానే కానీ, న్యూయార్కులో విమానం ఎక్కిన రెండు గంటల్లోనే, అంటే ఆ గుజరాతీ ఆయన నా పక్కన కూర్చుని మాటల్లోకి దించగానే, నా ఆలోచన ప్రారంభమయింది.

విమానం ఆకాశంలో 37,000 అడుగుల ఎత్తుకు వెళ్ళాక, నా పక్కనే కూర్చున్న ఆయన “నా పేరు మెహతా. బరోడాలో బిజినెస్ చేస్తుంటాను. ఆ పనిమీదే అమెరికా వచ్చి, వెనక్కి

వెడుతున్నాను. మీరేం చేస్తుంటారు"? అని అడిగాడు.

చెప్పాను. తర్వాత చాలసేపటివరకూ అతనే మాట్లాడాడు. అతను అమెరికాలో, డల్లాస్‌లో ఆరేళ్ళు ఉన్నాడుట. తరువాత ఇండియాలో ప్రభుత్వ సహాయంతో బిజినెస్ మొదలు పెట్టాడుట. చాలా బాగా నడుస్తున్నదని చెప్పాడు.

"నేను కూడా మొదట్లో అలాగే అనుకున్నాను. అమెరికాలో ఐదారేళ్ళుండి, ఇండియాకి తిరిగి వెళ్ళిపోవాలనీ, అక్కడ ఏదన్నా స్వంతంగా ప్రారంభించాలనీ.... కుదరలేదు"

"ఎందుకని?" అడిగాడు మెహతా.

"ఏపని చేయాలన్నా గవర్నమెంటు మీద ఆధారపడాలి. ప్రతిదానికీ పర్మిట్లు, లైసెన్సు న్యూసెన్సులు. లంచాలివ్వాలి. అక్కడ చాలామంది ప్రభుత్వోద్యోగులు మన జేబులో డబ్బుల్నే కాకుండా మనల్ని కూడా శవాన్ని పీక్కుతిన్నట్టు తినేస్తారు. అందుకే కొన్నాళ్ళు ఆ ప్రయత్నాలు చేసి - ఆ అధికారుల జులుం, లంచాలు, భరించలేక మానుకున్నాను. నా కష్టార్జితం చాల డబ్బులు ఖర్చయిపోయాయి కూడాను" అన్నాను.

మెహతా పెద్దగా నవ్వాడు.

నేను అతన్ని వింతగా చూడటం చూసి, నవ్వు ఆపి అన్నాడు. "అలా నవ్వినందుకు క్షమించండి. అది సభ్యత కాదని నాకు తెలుసు" ఒక్క క్షణం ఆగి మళ్ళీ అన్నాడు. "నిజానికి మీరు చెప్పినదాంట్లో అసత్యమేమీ లేదు. ఇంతకు ముందుకన్నా కూడా లంచాలు, అవినీతి, బంధుప్రీతి బాగా పెరిగిపోయాయి. అందుకని మనం ఆ వాతావరణానికి తగ్గట్టు ఏ ఎండకా గొడుగు పట్టాలి. ఆ పని చేయగలిగితే ఇక వేరే అడ్డు అంటూ వుండదు".

"అలా లంచాలు ఇవ్వటం నాకేమాత్రం ఇష్టం లేదు" అన్నాను.

అతను ఈ సారి సీరియస్‌గానే అన్నాడు - "మీ ఆశయాలకి, నిర్ణయాలకి చాల సంతోషిస్తున్నాను. కానీ నాలాటి వాడికి ఆ లంచాలవల్ల చాల లాభాలున్నాయి. సిటీ, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల్లో, ఏపని కావాలన్నా నిమిషాల్లో చేసిపెట్టే వాళ్ళున్నారు. కాకపోతే కొంత ఖర్చు. మన వ్యాపారం బడ్జెట్‌లో అదికూడా ముందే లెఖ్ఖ వేసుకుంటాము కనుక అది వేరే ఖర్చుగా అనిపించదు".

మెహతాతో వాదించదలుచుకోలేదు. ఎందుకంటే, ఆ పనిచేయనిదే, ప్రభుత్వ యంత్రాంగం కదలదు కనుక. అదేమీ కొత్త విషయం కాదు కనుక.

తరువాత బొంబాయి ఎయిర్‌పోర్టులో దిగేదాకా, ఆ విషయం గురించి ఆలోచన రాలేదు.

కస్టమ్స్ దగ్గర దుబాయ్ నించి వచ్చిన ఒక మలయాళీ అతను, గ్రీన్‌ఛానల్ లైన్లో నా ముందు నుంచుని ఉన్నాడు. కన్వేయర్ బెల్టు మీద వస్తున్న అతని సామాన్ని ఎక్స్‌రేలో చూస్తూ, అక్కడి క్లర్క్ అడిగాడు - "మీ సూట్‌కేసులో, కేమ్ కార్డర్లు ఒకటో రెండో కనిపిస్తున్నాయి" అని.

మలయాళీ మిత్రుడు నవ్వి - "అవును సార్. అని సోనీ మేడ్. లేటెస్ట్ డిజిటల్ టెక్నాలజీ. మా తమ్ముళ్ళకి ఇద్దామని తీసుకువెడుతున్నాను. ఇది వుంచండి" అని కొన్ని డాలర్లు అతని చేతిలో వుంచాడు.

అతను ఆ నోట్లు పాంట్ జేబులోకి తోసేసి "ట్రివేండ్రం ఫ్లైట్‌కి ఆలస్యమవుతుందేమో.... వెళ్ళండి" అన్నాడు నవ్వుతూ.

అదే క్లర్క్ నా సూట్‌కేసి విప్పదీసి, సామానులన్నీ కింద పడేసి చెక్ చేస్తుంటే, హుందాగా వెళ్ళిపోతున్న అతన్ని ఒకసారి చూసి, ఆ విసిరేసిన సామాన్లని మళ్ళీ సర్దుకున్నాను.

హైద్రాబాదులో మామయ్య గారింట్లో దిగాను. ఆ రోజు రాత్రి, మామయ్య వాళ్ళ అబ్బాయి సురేష్‌ని అడుగుతున్నాడు. "ఒరేయ్! నాలుగు రోజుల్నించి చెబుతున్నాను. మన ఇంటి టాక్సుగురించి కనుక్కున్నావా?" అని నా వేపు తిరిగి, "చెప్పాపెట్టకుండా వీళ్ళు టాక్స్ పెంచుతుంటారు. వాళ్ళతో మాట్లాడిరారా అంటే వీడు కదలడు. నేనేమో వెళ్ళలేను" అన్నాడు.

సురేష్ నాతో అన్నాడు - "చూడు బావా. టక్స్‌లు ఇలా వాళ్ళు పెంచుతున్నప్పుడల్లా, ఆఫీసుల చుట్టూ కాళ్ళు అరిగేటట్టు తిరగటం, చివరికి వాళ్ళు చెప్పినంతా కట్టేయటం. నాన్న చెబితే అర్థంచేసుకోడు. నా ఫ్రెండ్స్ ఎవ్వరూ అలా కట్టరు. ఆ ఆఫీసుకి పోయి, ఆ వెధవల మొఖాన కాస్త పడేస్తే ఏ గొడవా వుండదు. చాల సులభంగా పోయేదానికి, ఊరికే అందర్నీ ఇబ్బంది పెడుతూ వుంటాడు నాన్న".

"లంచాలు ఇవ్వటం ఎందుకు? వాళ్ళు జీతాలు తీసుకోవటంలేదా? మనం న్యాయంగానే అడుగుదాం. ఎందుకు చెయ్యరు?" అరిచినంత పనిచేశాడు మామయ్య.

సురేష్ మామయ్యనోసారి పూర్వకాలపు పరంధామయ్యలా చూసి, మాట్లాడకుండా లోపలికి వెళ్ళిపోయాడు.

మర్నాడు ప్లాట్ అమ్మకం గురించి అంతా ఫైనలైజ్ చేశాం. ఇక రిజిస్ట్రేషన్ మాత్రం మిగిలింది.

"రేపు పొద్దున్నే మనం రిజిస్ట్రార్ ఆఫీసుకి వెళ్ళి ఆ పని పూర్తిచేసేద్దాం....." అన్నాను.

అప్పటిదాకా మధ్యవర్తిగా వుండి, నా పనులన్నీ చేసి పెడుతున్న కోటేశ్వర్రావ్ అన్నాడు.

"మీకెందుకు సార్ శ్రమ. ఇక్కడ పనులు మీరనుకున్నంత సులభం కాదు. నేను అన్నీ చూసుకుంటాను. మీరు రేపు మధ్యాహ్నం రెండు గంటలకి, అక్కడికోసారి సరదాగా రండి. అప్పటికి అన్నీ సిద్ధం చేసి వుంచుతాము. మీరు వచ్చి ఒక సంతకం పడేస్తే సరిపోతుంది". ముత్యాలముగ్గు సినిమాలో రావు గోపాలరావులా చెప్పాడు.

ఈ కోటేశ్వర్రావెవరో అసాధ్యుడిలా ఉన్నాడే అనుకుంటుండగా, అతను అన్నాడు - "ఆ రిజిస్ట్రారుకీ, గుమస్తాలకీ కాస్త గడ్డి పడేస్తే, మనం చెప్పిన టైముకి అన్నీ రెడీ చేస్తారు".

"అంటే మనం లంచం ఇవ్వాలా?" అన్నాను.

కోటేశ్వర్రావు ఏమీ అనలేదు. ఒక చిరునవ్వు నవ్వి వూరుకున్నాడు.

కొంచెం ఆగి అన్నాడు - "మరి మళ్ళీ మీరు ఎల్లుండి గుంటూరుకి వెళ్ళి పోవాలి కదా".

"అవును" అన్నాను ఆలోచిస్తూ.

ఆ రోజు సాయంత్రం సురేష్‌ని అడిగాను - "సురేష్! ఎల్లుండి మధ్యాహ్నం నేను గుంటూరు వెళ్ళాలి. మామయ్య నువ్వు ఇవాళ ట్రైన్ రిజర్వేషన్ చేసి టికెట్టు కొనుక్కొస్తావని చెప్పాడు. తెచ్చావా? ఎంతయింది?" అన్నాను జేబులోంచి పర్స్ బయటికి తీస్తూ.

సురేష్ నవ్వాడు - "నేను పది రోజుల కొకసారయినా రైల్లో ప్రయాణ ంచేస్తుంటాను బావా. ఇంతవరకూ రిజర్వేషన్ చేసుకుని ప్రయాణం చేయలేదు. స్టేషన్‌కి పోవటం, అక్కడ చెమటలు కక్కుకుంటూ క్యూలో నుంచోటం, చివరికి మనం అనుకున్న ట్రైన్‌కి టికెట్టు దొరికేదాకా అనుమానమే. అందుకని ఏనాడో ఆ పని మానేశాను".

"మరి అప్పటికప్పుడు వెళ్ళి, ఏ జనరల్ కంపార్టుమెంటులోనో కూర్చోవాలంటే కష్టం కదా. అందులోనూ ఈ పెద్ద పెద్ద సూట్‌కేసులతో....." అన్నాను.

సురేష్ మళ్ళీ నవ్వి "నువ్వేమీ దిగులు పడకు. అంతా నేను చూసుకుంటాను కదా. రిజర్వేషన్‌తో, సుఖంగా నువ్వు ప్రయాణం చేసే పూచీనాది" అన్నాడు.

ఆ రోజు రాత్రి, నిద్ర సరిగ్గా పట్టక మంచం మీద అటూ ఇటూ దొర్లుతుంటే, హఠాత్తుగా పురుషోత్తం గుర్తుకొచ్చాడు. పోయినసారి నా ఇండియా ట్రిప్‌లో అనుభవాలను, గవర్నమెంటాలిటీ కథలుగా వ్రాసినప్పుడు చదివి మెచ్చుకున్నాడు. ఆ నాటి మా చర్చలో, ఈ ప్రభుత్వోద్యోగులు ఇలా లంచ గొండులుగా ఎందుకు తయారయారు? రాజకీయ నాయకులు వాళ్ళకి వత్తాసు పలుకుతూ, కంచెలే చేను మేస్తుంటే మన దేశం ఏమవుతుంది? మరి ప్రజలు ఏం చేస్తున్నారు? ఏమీ పట్టనట్టు ఎందుకు ఊరుకుంటున్నారు? ఈ ప్రశ్నలన్నీ ఆ రోజు మా మనసుల్ని తొలిచేశాయి.

ఆ విషయం గుర్తుకు వచ్చి ఆలోచిస్తుంటే, ఆ రాత్రి ఇక నిద్రపట్టలేదు. అప్పుడే అనిపించింది. మన సమాజంలో ఈ లంచాల పద్ధతి ఉండటం వల్లనే చాలమంది - లంచాలు తీసుకునే వాళ్ళేకాక ఇచ్చేవాళ్ళూ - లాభం పొందుతున్నారనిపిస్తోంది. ఇచ్చేవాళ్ళు లేకపోతే తీసుకునే వాళ్ళకి డబ్బులెలా వస్తాయి? అంటే అమెరికన్ కార్పొరేట్ భాషలో 'విన్-విన్ సిట్యుయేషన్' అన్నమాట. అంటే మన మాతృభాషలో 'సర్వేజనా సుఖినోభవంతు' అని అర్థం. అందువల్లనేనేమో, లంచాల తుపాను ముంచేస్తున్నా, చాలమంది జనం నిమ్మకు నీరెత్తినట్టుగా అవినీతికి నిశ్శబ్ద నీరాజనం సమర్పించటం.

గుంటూరు వచ్చేటప్పుడు రైల్లో, నా ఎదురు సీట్లో ఒకావిడ, ఆవిడ భర్త, ఇద్దరు చక్కటి పిల్లలు కూర్చున్నారు.

ఆ పిల్ల తమ్ముడ్ని అడుగుతున్నది.

"ఒరే శీనూ! కోడి ముందు పుట్టిందా, గుడ్డ ముందు పుట్టిందా?"

శీను, వాళ్ళక్కకేమీ తెలియనట్టు నవ్వి అన్నాడు.

"కోడి లేకపోతే గుడ్డెట్లా వస్తుందే. కోడే కదా గుడ్డు పెట్టేది?"

వాళ్ళక్క కూడా నవ్వి, "కోడెక్కడినించి వస్తుందిరా, గుడ్డు లేకపోతే? గుడ్డులోనించే కదా వచ్చేది కోడి" అన్నది.

శీను ఒక్కక్షణం ఆలోచించి, తల గోక్కున్నాడు. రెండు మూడు సార్లు, తనలో తనే అనుకున్నాడు, 'కోడి ముందా, గుడ్డు ముందా' అని. కాసేపాగి, వాళ్ళ నాన్నని అడిగాడు.

ఆయన కూడా నవ్వి, "అదేరా నాకు కూడా అర్థం కావటం లేదు" అన్నాడు.

ఆ ఇద్దరు పిల్లలకీ ఆయన జవాబు నచ్చినట్టులేదు. ఆ పిల్ల, కుర్రాడు - 'నాన్నకేమీ తెలీదు. మనమే ఆలోచించి, కనుక్కోవాలి' అన్నట్టుగా ముఖాలు పెట్టారు.

ఆ క్షణాన నాకేదో తెలిసినట్టు అనిపించింది. లంచాలు తీసుకునే వాళ్ళు ప్రాణాలు తోడేస్తుంటే, లంచాలు ఇస్తుంటారు ప్రజలు. అలాగే లంచాలిచ్చే వాళ్ళు కూడా స్వలాభంతో ఇస్తున్నారు కనుక, తీసుకునే వాళ్ళు ఏమాత్రం పాపభీతి లేకుండా అవినీతికి పాల్పడుతుంటారు. మరి లంచాలు ఇచ్చేవాళ్ళు ఎవరూ లేకపోతే, తీసుకునేవాళ్ళు ఎలా వుంటారు? అది ముందా, ఇది ముందా అనే 'కోడి-గుడ్డు' వాదన, నీతికీ అవినీతికీ ఒకేలా వర్తించాలికదా! మరి ఈ లంచాల విషయంలో ఎందుకు పనిచేయటం లేదు? ఆ ప్రశ్నకు జవాబు తెలిసినట్టే వున్నా, నిజానికి ఆ ఎదురు సీటులోని పెద్దమనిషి అన్నట్టుగా, నాకూ అర్థం కాలేదు.

అయినా ఆ చిన్న పిల్లల్ని చూస్తుంటే ఒకటి మాత్రం అనిపించింది. వాళ్ళ బంగారు భవిష్యత్తులాగానే, ఆ ప్రశ్నలకు జవాబులే కాక, ఆ సమస్యలకు పరిష్కారాలు కూడా వాళ్ళ చేతుల్లోనే వున్నాయి మరి! ●

*(రచన ఇంటింటి పత్రిక : నవంబర్, 1999)*